క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: ఎయిర్‌పోర్ట్, హెచ్‌పీఎస్, ఐడీపీఎల్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ బానోతు చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఐఏఎస్ క్వార్టర్స్, ఐపీఎస్ క్వార్టర్స్, మినిస్టర్ క్వార్టర్స్. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రకాష్‌నగర్, రాహుల్ బజాజ్ వెనుక ప్రాంతం, చీకోటి గార్డెన్, మయూరిమార్గ్, అల్లంతోటబావి, గీతాంజలి స్కూల్, మూసాపేట్ క్రాస్‌రోడ్డు, శక్తినగర్, మూసాపేట్, అల్సబా హోటల్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని వినియోగదారులు సహకరించాలన్నారు.

రాజేందర్‌కు డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విద్యార్థి రాజేందర్‌కు ఓయూ పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. సీనియర్ అధ్యాపకురాలు ప్రొ.అరుణజ్యోతి పర్యవేక్షణలో 'ఈ–గవర్నెన్స్ చెంజింగ్ నేచర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ స్టడీ ఆఫ్ మేడ్చల్, మల్కాజిగిరి అండ్ మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్స్ ఆఫ్ తెలంగాణ స్టేట్' అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందని అధికారులు పేర్కొన్నారు.

డా. కిరణ్ సేవలు అభినందనీయం



డాక్టర్ కిరణ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గత పన్నెండేళ్ల నుంచి పిల్లల వైద్యుడిగా డాక్టర్ కిరణ్ అందించిన సేవలు అభినందనీయమని పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది కొనియాడారు. పీడియాట్రీషన్, హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన ఆయన ఇటీవల పదోన్నతిపై తాండూరుకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో బుధవారం హాస్పిటల్‌లో డాక్టర్ కిరణ్‌కు వీడ్కోలు, అభినందన సమావేశం నిర్వహించారు. క్లస్టర్ ఇన్‌చార్జి డాక్టర్ రాజశ్రీ, డాక్టర్ పల్లవి, డాక్టర్ భాను స్వరూప, హెడ్ నర్సులు రత్న, శారా పాల్గొన్నారు.

ధర్నాకు తరలిన బీజేపీ నేతలు



ధర్నాలో పాల్గొన్న సుష్మిత

రసూల్‌పురా: బీజేపీ ఆధ్వర్యంలో నగరంలోని ఇందిరా పార్క్ వద్ద బుధవారం చేపట్టిన 24 గంటల దీక్ష కార్యక్రమానికి సీనియర్ నాయకులు డా.సుష్మిత నేతృత్వంలో కంటోన్మెంట్ అన్ని వార్డుల నుంచి భారీగా తరలివెళ్లారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరశురాం, రాయల్‌కుమార్, అశోక్, బొట్టు శంకర్, మమత, భాగ్యలక్ష్మి , వినోద, భువనేశ్వరీ, లలిత తరలివెళ్లారు.

కేన్సర్‌పై అవగాహన కార్యక్రమం



స్క్రీనింగ్ క్యాంపు కార్యక్రమంలో పాల్గొన్న సదా కేశవ రెడ్డి

రసూల్‌పురా: యాక్షన్ ఎయిడ్ గ్రూప్ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ బోర్డు రసూల్‌పురా గన్‌బజార్‌లో బుధవారం నిర్వహించిన కేన్సర్‌పై అవగాహన, స్క్రీనింగ్ క్యాంప్‌ను బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రసూల్‌పురా స్లమ్ ఏరియాలో యాక్షన్ ఎయిడ్ సంస్థ వివిధ ప్రాణాంతక వ్యాధులపై అవగాహన కల్పిస్తూ ఉచితంగా చికిత్స మందులు అందజేయడం హర్షణీయమన్నారు. డాక్టర్ రాజకుమారి, ఎంవో సుష్మ, వైద్యులు తేజస్విని, సంతోష్, ప్రణవి, సంతోషి స్థానికులు అశోక్, జబ్బార్, మణికంట పాల్గొన్నారు.


'డబుల్' ఇళ్ల కోసం మహిళల ఆందోళన

హిమాయత్‌నగర్: తమకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వకుండా మోసం చేస్తున్నారంటూ హిమాయత్‌నగర్ డివిజన్ స్ట్రీట్ నెంబర్ 14లోని మహిళలు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే కేవలం ఎన్నికలప్పుడే వాగ్దానాలు ఇచ్చి మభ్య పెడుతున్నారంటూ విమర్శించారు. ఈ మేరకు బుధవారం హిమాయత్‌నగర్ స్ట్రీట్ నెంబర్ 14లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం మహిళలు నిరసనకు దిగారు. సొంత ఇళ్లున్నవారికే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. పలువురు మహిళలు మాట్లాడుతూ... ఏళ్ల తరబడి దరఖాస్తు చేసుకోవడానికే సరిపోతున్నదని, తమకు మాత్రం ఇళ్లను మంజూరు చేసేవారు లేరంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

జాడలేని ఫాగింగ్.. దోమల ఫైరింగ్



అడ్డగుట్టలో విజృంభిస్తున్న దోమలు	రోగాల బారిన ప్రజలు	ఫాగింగ్ చేయాలంటున్న కాలనీల వాసులు	విస్మరిస్తున్న అధికారులు



అడ్డగుట్ట: దోమల విజృంభణతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండాపోతుంది. రాత్రి అయిందంటే చాలు దోమల రోతతో స్థానికులకు తిప్పలు తప్పడం లేదు. సకాలంలో ఫాగింగ్ చేయకపోవడం కారణంగానే దోమలు వ్యాప్తి చెందుతున్నాయని ఆయా ప్రాంతాల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దట్టమైన చెట్లు ఉన్న ప్రదేశాలు, నాలా పరీవాహక ప్రాంతాల్లో సక్రమంగా ఫాగింగ్ నిర్వహిస్తే దోమలు వృద్ధి చెందే అవకాశం తక్కువగా ఉంటుంది. అతిపెద్ద మురికివాడగా పేరున్న అడ్డగుట్టలో వారంలో రెండు లేదా మూడు సార్లు ఫాగింగ్ నిర్వహించాలి. కానీ వారంలో ఒక్కసారి కూడా ఫాగింగ్ చేయకపోవడంతో దోమలు దండయాత్ర చేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు.

సీజనల్ వ్యాధుల కాలం కావడంతో..

ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజల ఇబ్బందులపై దృష్టి సారించాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో దోమకాట్లకు గురై వివిధ రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. గట్టిగ అడిగినప్పుడే మాత్రమే తూతూ మంత్రంగా ఫాగింగ్ చేసిన ఆ తర్వాత అటువైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అడ్డగుట్ట ఏ, బీ, సీ, డీ సెక్షన్లు, ఆజాద్ చంద్రశేఖర్ నగర్, మాంగరోడియా బస్తీ, బోయ బస్తీ, సాయినగర్, ఇంద్రలక్ష్మి నగర్, లోహియనగర్, కొండారెడ్డినగర్, గడ్డమీది బస్తి, వడ్డెర బస్తి, శాస్త్రినగర్, వెంకటనగర్, శాంతినగర్ తదితర బస్తీలలో దోమలు రోజురోజుకు వ్యాప్తి చెంది రోగాల బారిన పడేస్తున్నాయని వాపోతున్నారు.

ఫాగింగ్ చేయడం లేదు



బస్తీల్లో దోమలు విజృంభించి రోగాలబారిన పడేస్తున్నాయి. దోమలను పూర్తి స్థాయిలో అరికట్టే విధంగా సంబంధిత సిబ్బంది ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదు. ఆయా బస్తీలో ఫాగింగ్ చేయకపోవడంతో సాయంత్రం అయిందంటే చాలు గుంపులు గుంపులుగా వాలిపోతున్నాయి. దోమ కాట్లతో చిన్నారులు, వృద్ధులు అనారోగ్యాలకు గురవుతున్నారు. వారంలో మూడు సార్లు ఫాగింగ్ చేయాలి.

–గెల్లు ఉదయ్ యాదవ్, అడ్డగుట్ట

అధికారుల అవగాహన

అసలే స్లమ్ ప్రాంతమైన అడ్డగుట్టలో నిత్యం డ్రైనేజీ ప్రవాహం, దానికి తోడు నాలాలు, అదే విధంగా ఖాళీ ప్రదేశాల్లో దట్టమైన పిచ్చి మొక్కలు, చెట్లు. వీటన్నింటి కారణంగా దోమలు బస్తీల్లో విజృంభిస్తున్నాయి. ఇదే విధంగా మరెన్నో ప్రాంతాల్లో నిత్యం ప్రజలు దోమ కాటు కారణంగా మలేరియా, డెంగీ ఇతర ప్రాణాంతకమైన వ్యాధులకు గురవుతున్నారు. దోమల నియంత్రణకు ప్రజలు కూడా పరిసరాల పరిశుభ్రతను పాటించాల్సిన అవసరం ఉంది. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోని కారణంగా చెత్తాచెదారం పోగవుతుంది. దీంతో దోమలు వ్యాప్తి చెందుతాయి. అంతే కాకుండా ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలను కూడా ఉండకుండా చూసుకోవాలి. డ్రమ్ములు, కూలర్లు, పూల కుండీలు, పాత సామాన్లలో నీళ్ల నిల్వ ఉండడంతో దోమలు అందులో గుడ్లు పెడతాయి. తద్వారా దోమలు వృద్ధి చెందుతాయి. అందువల్ల ప్రతీ ఫ్రైడే ను డ్రైడే గా పాటించి, ఇంటి పరిసరాల్లో ఉన్న నీటి నిల్వలను శుభ్రం చేసుకుంటూ ఉండాలని ఎంటమాలజీ విభాగం అధికారులు సూచిస్తున్నారు.

ప్రజారోగ్య సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం



ఆయుష్మాన్‌భారత్ సేవలను ప్రారంభిస్తున్న శ్రీలత శోభన్‌రెడ్డి

లాలాపేట: ప్రత్యేక తెలంగాణలో ప్రజలందరి ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా సీఎం కేసీఆర్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో అన్ని వసతులతో కూడిన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఏర్పాటు చేసిందన్నారు. వీటికి తోడుగా కేంద్ర ప్రభుత్వం అధ్వర్యంలో అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాన్ని బుధవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వర్చువల్‌గా ప్రారంభించిన కార్యక్రమాన్ని డిప్యూటీ మేయర్ లాలాపేటలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, వైద్య సిబ్బందితో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లలో వారం వారం ఆరోగ్యమేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. టెలీ కన్సల్టేషన్, అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్, యోగా వెల్‌నెస్ సెషన్లు ఉంటాయన్నారు. డయాలసిస్, అవయవ మార్పిడి వంటి ఖరీదైన చికిత్సలు సైతం అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సౌశీల్యారాణి, డాక్టర్ పల్లవి, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పశు వైద్యశాలల పునరుద్ధరణకు వినతి



మంత్రిని సత్కరిస్తున్న సహకార యూనియన్ డైరెక్టర్లు

లాలాపేట: శిథిలావస్థకు చేరిన పశువైద్య శాలలను పునరుద్ధరించాలని మంచిర్యాల జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ చైర్మన్ డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో పలువురు జిల్లా డైరెక్టర్లు బుధవారం పశుసంవర్థక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గొర్రెల మేకలకు సంబంధించి వ్యాక్సిన్లు, లీవర్ టానిక్‌లు పెంచాలని, పిడుగుపాటుకు మరణించిన గొర్రెలు, కాపరులకు నష్టపరిహారం అందించాలనీ విజ్ఞప్తి చేశారు. పిడుగుపాటు మరణాలకు నష్టపరిహారం విషయమైన సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని ఈ సందర్భంగా మంత్రి వారికి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో మహేశ్‌యాదవ్, నరేష్ యాదవ్, లింగన్న, బాపు, గంగమల్లు, తిరుపతి, నరసయ్య ఉన్నారు.

బీసీలకు ప్రాధాన్యం కల్పించండి



పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న బీసీ నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ నాయకులకు సీట్ల కేటాయింపులో తగిన ప్రాధాన్యం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని సెంట్రల్ కోర్టు హాల్లో జరిగిన సమావేశంలో టీపీసీసీ ఓబీసీ డిక్లరేషన్ కమిటీ చైర్మన్ పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం ఇచ్చారు. కాంగ్రెస్‌కు వెన్నుదన్నుగా ఉన్న బీసీలను ఇప్పుడు విస్మరించరాదన్నారు. ప్రతిసారీ నల్గొండ జిల్లాలో ఒకే ఒక బీసీకి టికెట్ కేటాయిస్తున్నారని ఈ దఫా ఐదు ఎమ్మెల్యే సీట్లను ఇవ్వాలన్నారు. మారుతున్న కాలంతో పాటు బీసీలు చైతన్యవంతులు అవుతున్నారని అధిక జనాభా గల బీసీలకు ఎక్కువ సంఖ్యలో సీట్లు ఇవ్వని పార్టీలకు తగిన గుణపాఠం చెబుతామన్నారు. వినతి ఇచ్చిన వారిలో రాష్ట్ర అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్, సతీష్, వెంకన్నయాదవ్ ఉన్నారు.

కాంగ్రెస్‌కు పూర్వవైభవం ఖాయం



రూబీమనోహరన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సాయిబాబా

చిలకలగూడ: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు కార్యకర్తలు తమ వంతు కృషి చేయాలని సికింద్రాబాద్ పార్లమెంట్ పరిశీలకుడు, తమిళనాడు కాంగ్రెస్ కోశాధికారి రూబీమనోహరన్ సూచించారని సీనియర్ నాయకుడు నాగులూరి సాయిబాబా తెలిపారు. విజయభేరి బహిరంగ సభ, సీడబ్ల్యూసీ సమావేశ ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చిన ఆయనను బుధవారం సాయిబాబా కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. తెలంగాణతో పాటు సికింద్రాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపునకు అనుసరించాల్సిన వ్యూహాలు, సలహాలు, సూచనలు అందించారన్నారు. ఈనెల 17న తుక్కుగూడలో నిర్వహించే విజయభేరి సభను విజయవంతం చేసేందుకు నియోజకవర్గం నుంచి పెద్దసంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులను తరలించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు సాయిబాబా వివరించారు.

అధ్యాపకుల ఆందోళనలపై చులకన తగదు



ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని 12 వర్సిటీల కాంట్రాక్ట్ అధ్యాపకులు ఉద్యోగాల పర్మనెంట్ కోసం చేస్తున్న ఆందోళనలపై చులకనభావం తగదని జేఏసీ చైర్మన్ డా. ధర్మతేజ ధ్వజమెత్తారు. బుధవారం 14వ రోజు పెన్‌డౌన్–చాక్‌డౌన్ ఆందోళనలో భాగంగా ఓయూ క్యాంపస్ ఆర్ట్స్ కాలేజీ బస్టాప్ వద్ద ధర్నా చేపట్టారు. గతంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాల పర్మనెంట్ కోసం పోరాడుతుంటే వర్సిటీల అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. అధ్యాపకులు విధులు బహిష్కరించడంతో విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన నిలిచిపోయినా పట్టించుకోవడం లేదన్నారు.

'ఓటరు నమోదు'కు సహకరించాలి



రాజకీయ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్ఓ ఎల్లారెడ్డి

సికింద్రాబాద్: ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం కోసం రాజకీయాలకతీతంగా అన్ని పార్టీల నాయకులు సహకరించాలని సికింద్రాబాద్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎల్లారెడ్డి కోరారు. బుధవారం సికింద్రాబాద్ సర్కిల్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలతో ఎన్నికల అధికారి ఎస్.సుధాంశ్ నేతృత్వంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎల్లారెడ్డి మాట్లాడుతూ.. కొత్త ఓటర్ల నమోదు, జాబితాలో సవరణ నిమిత్తం బూత్‌లెవల్ ఆఫీసర్లు ఇంటింటి పర్యటనలు చేస్తున్నట్లు తెలిపారు. అర్హులను ఓటర్లుగా నమోదు చేసుకునేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సహాయక అధికారులు హేమలత, భుజేందర్ బాబు, జలంధర్‌రెడ్డి, రాజసుందర్, ప్రవీణ్, ప్రకాశ్, కరుణాకర్ పాల్గొన్నారు.

బల్దియా కమిషనర్‌కు బీజేపీ నాయకుల వినతి



వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

అమీర్‌పేట: జనవాసాల నడుమ ఉన్న గ్యాస్ గోడౌన్‌తో ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని బీజేపీ నాయకుడు మర్రి శశిధర్ రెడ్డి పేర్కొన్నారు. బల్కంపేట రేణుకానగర్ ఈస్ట్ ప్రాంతంలో ఉన్న గ్యాస్ గోడౌన్ గురించి బుధవారం ఆయన జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మర్రి మాట్లాడుతూ.. ఈ సమస్యపై కమిషనర్ సానుకూలంగా స్పందించి ప్రమాదకరంగా ఉన్న గ్యాస్ గోడౌన్‌ను సందర్శించి సమగ్ర నివేదికను ఇవ్వాలని అగ్నిమాపక శాఖ అధికారులను ఆదేశించారన్నారు. వినతి ఇచ్చిన వారిలో రవీందర్‌రెడ్డి, నరేందర్, రాదే శ్యామ్, యాదగిరి, శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

మట్టి విగ్రహాల అందజేత



మట్టి ప్రతిమలను అందజేస్తున్న సంస్థ సభ్యులు

అమీర్‌పేట: మట్టి వినాయకుడు పర్యావరణ సంరక్షకుడు అనే నినాదంతో మట్టి ప్రతిమలపై అవగాహన కల్పించడంతో పాటు రాయల సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం బల్కంపేట ప్రభుత్వ పాఠశాలలో వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు ఆర్.సి.కుమార్ మాట్లాడుతూ.. రసాయనిక పదార్థాలను ఉపయోగించి తయారు చేసే వినాయక విగ్రహాలు పర్యావరణానికి హాని కలిగిస్తాయన్నారు. ఇలాంటి విగ్రహాలకు దూరంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించి సొంత నిధులతో అవసరమైన చోట మట్టి విగ్రహాలను అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు అమరేశ్వరి, నాగరేఖ, విజయ పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యలకు పరిష్కారం



డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: ఎప్పటికప్పుడు సమస్యలను తెలుసుకొని దశలవారీగా పరిష్కరిస్తున్నామని కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి తెలిపారు. బుధవారం అడ్డగుట్ట ఏ–సెక్షన్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. అవసరమైన అన్ని బస్తీల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని వీలైనంత తొందరగా డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం కృష్ణ, ఏఈ స్రవంతి, నేతలు లింగాని శ్రీను, శ్రీనివాస్‌గౌడ్, మనోహర్, ఎల్లయ్య, మహ్మద్, వసంత, పొన్నాల రాజు, శ్రీరాములు, వడ్లూరి రవి, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఆగమన్.. అదిరెన్



గజానన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక ప్రతిష్ఠాపనకు తొమ్మిదేళ్లు పూర్తి చేసుకుని పదో ఏటాకు చేరిన సందర్భంగా క్రాంతిపటేల్, వినయ్‌కుమార్, శ్రవణ్‌కుమార్, ఉదయ్‌కుమార్ అధ్వర్యంలో నిర్వహించిన గణేష్ ఆగమన్ ఆకట్టుకుంది. బేగంపేటలోని అల్లంతోటబావి మండపానికి భారీ గణపయ్యను డీజేల హోరు యువకుల నృత్యాల నడుమ తరలించారు.

–సాక్షి, సిటీబ్యూరో

క్రైం కార్నర్..

బైక్ దొంగల రిమాండ్



కౌశిక్

లాలాపేట: ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్న ఇద్దరిని రిమాండ్‌కు తరలించిన ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు వివరాల ప్రకారం..హయత్‌నగర్ మన్సూరాబాద్‌కు చెందిన బవనీయులు కౌశిక్ (21), వనస్థలిపురం సాహెబ్‌నగర్‌కు చెందిన మైనర్ (16) వేర్వేరుగా ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన బైకలను దొంగిలిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దొంగలపై నిఘా ఉంచారు. బుధవారం హబ్సిగూడ వద్ద చేపట్టిన వాహనాల తనిఖీలో బైక్‌లపై కౌశిక్, సదరు మైనర్ అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం చేస్తున్నట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కౌశిక్‌ను కోర్టులో, మైనర్ బాలుడిని డీపీఓ ముందు ప్రవేశపెట్టగా ఇద్దరికి రిమాండ్ విధించారు.

రైల్వేస్టేషన్‌లో దొంగతనాలు చేస్తున్న ఇద్దరికి..



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నర్సయ్య

సికింద్రాబాద్: సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా ఇరువురు నేరస్తులను రైల్వే పోలీసులు రిమాండ్‌కు తరలించారు. జీఆర్‌పీ డీఎస్పీ నర్సయ్య, ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీను కథనం ప్రకారం.. రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇరువురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా సికింద్రాబాద్, నాంపల్లి రైల్వేస్టేషన్లలో జరిగిన 9 దొంగతనాలు, 2 చైన్ స్నాచింగ్ మొత్తం 11 కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు తేలింది. ఇరువురి నుంచి 309 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్ర పుణేకు చెందిన మోతీలాల్ రెడ్డప్ప పవార్ (22), సంజయ్ సుభాష్ రాథోడ్ (33)పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

కూల్‌గా డ్యూటీ



ఎండలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసుల సౌకర్యార్థం బుధవారం ఏసీ హెల్మెట్లు అందజేశారు. సాధారణ హెల్మెట్‌తోఎండ వేడిమి కారణంగా మెదడుపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ఏసీ హెల్మెట్లతో మెదడుకు ఎండ తగలకుండా రక్షణగా ఉంటాయి. తార్నాక, హబ్సిగూడ తదితర ప్రాంతాల్లో ఏసీ హెల్మెట్లు పెట్టుకుని విధులు నిర్వహిస్తూ కనిపించారు. –లాలాపేట

పంథామార్చుకున్న పిక్‌పాకెటర్స్!

పంజగుట్ట: బస్సుల్లో పిక్ ప్యాకెటింగ్ చేసే వారు కొత్త పంథాను ఎంచుకున్నారు. పసిపిల్లల్ని బస్సు సీటులో కూర్చున్న వారి ఒడిలో ఉంచి వారిని తీసుకునే క్రమంలో మెడలోంచి బంగారు ఆభరణాలు దొంగిస్తున్నారు. అలాంటి ఘటనే పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అబ్దుల్లాపూర్, కోహెడాకు చెందిన పటేల్‌గూడెం లక్ష్మమ్మ జీహెచ్ఎంసీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి. ఈ నెల 11వ తేదీన లక్ష్మమ్మ పని నిమిత్తం సికింద్రాబాద్‌లో 10 నెంబర్ బస్సు ఎక్కింది. ఆమె సీటులో కూర్చుని ఉండగా ఆమె పక్కనే ఇద్దరు మహిళలు నిలబడి ఉన్నారు. వారి వద్ద ఉన్న పిల్లల్ని రెండు సార్లు లక్ష్మమ్మ ఒడిలో కూర్చుండబెట్టారు. బస్సు అమీర్‌పేట కనకదుర్గ అమ్మవారి దేవాలయం వద్దకు వచ్చాక లక్ష్మమ్మ బస్సు దిగి మెడలో చూసుకోగా మూడు తులాల బంగారు మంగళసూత్రం మాయమయ్యింది. తన ఒడిలో పిల్లల్ని కూర్చోబెట్టిన మహిళలే దొంగతనం చేసి ఉంటారని భావించిన లక్ష్మమ్మ కోర్టు ద్వారా పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ మోసం.. రూ. 47 వేలు స్వాహా

అడ్డగుట్ట: ప్లంబర్ కోసం ఆన్‌లైన్‌లో ఓ యాప్‌లో సెర్చ్ చేసిన మహిళ బ్యాంక్ ఖాతా లోంచి డబ్బులు కాజేసిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు వివరాల ప్రకారం.. మహేంద్రహిల్స్‌కు చెందిన శృతిగుప్తా అనే మహిళ అర్బన్ క్లాప్ అనే యాప్‌లో ప్లంబర్ కోసం సెర్చ్ చేయగా రస్ట్ డెస్క్ అనే కంపెనీ నుంచి శృతికి ఫోన్ వచ్చింది. ప్లంబర్‌ను బుక్ చేసినట్లు చెప్పి క్రెడిట్, డెబిట్ కార్డు స్కాన్ చేయాలని ఫోన్‌లో చెప్పగా అలాగే చేయడంతో ఆమె బ్యాంకు ఖాతాలో నుంచి రూ. 47 వేలు కట్ అయ్యాయి. వెంటనే ఫోన్ చేసినా ఎవ్వరూ స్పందించకపోవడంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హెర్నియా చికిత్సపై జాతీయ సదస్సు

సాక్షి, సిటీబ్యూరో: ది హెర్నియా సొసైటీ ఆఫ్ ఇండియా, ఇంట్యూటివ్ ఇండియా ఆధ్వర్యంలో హెర్నియా–శస్త్ర చికిత్స అధునాతన పద్ధతులపై నగరంలోని ట్యాంక్‌బండ్ సమీపంలోని మారియట్ హోటల్‌లో నిర్వహించిన మూడ్రోజుల హైకాన్ (హెచ్ఎస్ఐసీఓఎన్) జాతీయ సదస్సు బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. సదస్సుకు దాదాపుగా 500 మంది సర్జన్లు హాజరయ్యారని, సదస్సులో ఏర్పాటు చేసిన ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ద్వారా అధునాతన రోబోటిక్ సర్జరీలపై సర్జన్లు అవగాహన పెంచుకున్నారన్నారు.